
www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
శుక్రవారం | 26 | జూన్ | 2026 | పేజీలు: 08





# సీఎం సభకు సన్నద్ధం

## 28న నల్గొండకు రేవంత్ రాక

## రూ.13006 కోట్ల హ్యాం రోడ్లకు శ్రీకారం

## జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి ఈనెల 28న నల్గొండ జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ..మిగతా 2లో

# ఏఈలు ఉన్నారా.. పేరుకే పోస్టులా..?

## సీజన్ స్టార్ట్ అయినా పత్తా లేని ఏఈలు !



**“వర్షాకాలం మొదలైంది... విద్యుత్ శాఖ అప్రమత్తమేనా?”**

**“ఏఈలు ఉన్నారు... కానీ ప్రజలకు అందుబాటులో ఉన్నారా?”**

**నిజామాబాద్, అక్షిత ప్రతినిధి:** ఉత్తర తెలంగాణ జిల్లాలకు విద్యుత్ సరఫరా అందించే తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీజీఎన్‌పీడీసీఎల్) లో నిజామాబాద్ జిల్లా కీలక స్థానాన్ని దక్కించుకుంది. ప్రత్యేక సర్కిల్‌గా కొనసాగుతున్న నిజామాబాద్ జిల్లాలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణ కోసం భారీ స్థాయిలో ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నప్ప టికీ, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆశించిన సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా సర్కిల్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ప్రధాన అధికారిగా వ్యవహరిస్తుండగా, ఆయన ఆధ్వర్యంలో బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ అనే నాలుగు డివిజన్లు పనిచేస్తున్నాయి. ప్రతి డివిజన్‌కు డివిజనల్ ఇంజనీర్ (డీఈ), వారి కింద అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు (ఏడీఈలు), అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు) సేవలందించాల్సి ఉంటుంది. ఆర్మూర్ డివిజన్‌లో 14 మంది, బోధన్ మరియు నిజామాబాద్ రూరల్ డివిజన్లలో చెరో 10 మంది, నిజామాబాద్ అర్బన్ డివిజన్‌లో 16 మంది వరకు ఏఈలు ఉన్నట్లు సమాచారం. మొత్తంగా జిల్లాలో 50 నుంచి 60 మంది వరకు అసిస్టెంట్ ఇంజనీర్లు ఉన్నప్పటికీ, విద్యుత్ సమస్యల సమయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన ..మిగతా 2లో

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

- ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి
- క్రిటికల్ కేర్ భవనం పనులు వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలి
- పరిశుభ్రత, పారిశుధ్యం, రోగులకు మెరుగైన సేవలు, మర్యాదపూర్వక వైఖరిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా విడివోస్ కాలనీలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ మార్కెటిం గ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ..మిగతా 2లో


# తవ్విన కొద్ది మామూళ్ల “మత్తు” !

## ఎక్సైజ్ శాఖలో కలకలం!!

## ఎక్సైజ్ శాఖలో మరిన్ని అవినీతి చేపలున్నాయా..?

## డైరీలు రాసుకుంటూ నెలనెలా మామూళ్ల వసూళ్లు..?

## ఏసీబీ లోతైన విచారణ చేపట్టాలని డిమాండ్...?



మామూళ్లు ఇచ్చే వారి పేర్లు (గ్రామాల వారిగా)

**నిజామాబాద్, అక్షిత ప్రతినిధి :** తవ్విన కొద్ది గుట్టలు గుట్టలుగా అవినీతి లీలలు. జిల్లా ఎక్సైజ్ శాఖలో తాజాగా వెలుగులోకి వచ్చిన అవినీతి వ్యవహారాలు ఆ శాఖలో కలకలం రేపుతున్నాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అవినీతి కేసు బట్టబయలైన నేపథ్యంలో, ఆయనతో పాటు మరికొందరు అధికారులు కూడా అక్రమ సంపాదనలో కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు శాఖలోనే చర్చనీయాంశంగా మారాయి.శాఖలోని వర్గాల సమాచారం ప్రకారం, డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ ఎస్‌హెచ్‌వో ..మిగతా 2లో

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతా






## క్రీడలతో మానసిక ఉల్లాసం

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

## జిల్లా ఎస్పి స్నేహ మెహర

**వికారాబాద్, అక్షిత బ్యూరో :** డ్రగ్స్ రహిత జిల్లాగా వికారాబాద్ ను తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పి స్నేహ మెహరలు అన్నారు.వికారాబాద్ జిల్లాల్లో బ్లాక్ గ్రౌండ్ లో డ్రగ్స్ నివారణ మరియు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమంతో పాటు క్రీడా పోటీలను నిర్వహించారు. యువతలో ..మిగతా 2లో

# సీఎం సభకు సన్నద్ధం





మొదటి పేజీ తరువాయి...
ఈనెల 28 న 13006 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి రానున్నారని, ముందుగా నల్గొండ జిల్లా, కనగల్ మండల వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నిర్మించిన హ్యాం రోడ్ల పైలాన్ ను ఆవిష్కరిస్తారని, అనంతరం నల్గొండ ఎన్జి కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అక్కడే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపట్టే కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని, ముఖ్యంగా కనగల్ హెలిపాడ్ తో పాటు, నల్గొండ జిల్లా కేంద్రంలో డిటిసిలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యులకందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వాన పత్రికను పంపించాలని, పాసులు, ప్రోటోకాల్ పాటించాలన్నారు. ఆర్టీసీ ద్వారా బస్సుల ఏర్పాటు, స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలు బహిరంగ సభకు చేరుకునేందుకు ఏర్పాట్లతో పాటు, వాహన పార్కింగ్, రూట్లు, డయాస్



ఏర్పాటు చేయాలని, కళాజాత బృందాన్ని ,వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బహిరంగ సభ నిర్వహించే ఎన్జీ కళాశాల మైనదానంతో పాటు, కనగల్ వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, పార్కింగ్ అన్నింటిని ముందే సిద్ధం చేయాలని అన్నారు . కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యులు, డ్యూటీలో ఉండే అధికారులకు పాసులు జారీ చేయాలని చెప్పారు.

జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ముందే పాసులు తీసుకోవాలని, పార్కింగ్, స్టేజి, సీటింగ్ వీటన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని కోరారు .

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి , జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

మొదటి పేజీ తరువాయి...
ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు వైద్య సదుపాయాలు పరిశుభ్రత, ఔషధాల లభ్యత వైద్యులు సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు.అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.నరేందర్ వైద్య శాఖ అధికారులు తదితరులు పున్నారు.

## ఏఈలు ఉన్నారా.. పేరుకే పోస్టులా..?

మొదటి పేజీ తరువాయి...





నేపథ్యంలో భారీ వర్షాలు, ఈదురుగాలులతో విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో ఏఈలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సి ఉండగా, అనేక ప్రాంతాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫోన్ చేసినా స్పందన లేకపోవడం, విద్యుత్ అంతరాయాలపై వెంటనే చర్యలు తీసుకోకపోవడం, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వంటి అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, లైన్ లోపాల పరిష్కారం, కొత్త కనెక్షన్లు, వినియోగదారుల సమస్యల పరిష్కారం వంటి కీలక బాధ్యతలు ఏఈలపై ఉన్నప్పటికీ, కొందరు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు దూరంగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వర్షాకాలంలో విద్యుత్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, జిల్లాలోని ఏఈల పనితీరు, అందుబాటు, క్షేత్రస్థాయి పర్యటనలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతా

మొదటి పేజీ తరువాయి...
ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడాస్ఫూర్తి పెంపొందించడంతో పాటు డ్రగ్స్ నివారణ మరియు సైబర్ భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత క్రీడల వైపు మళ్లడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు మాదకద్రవ్యాల వంటి సామాజిక దురాచారాలకు దూరంగా ఉండగలరని అన్నారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

అదేవిధంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు, యువతకు అవగాహన





కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించి, క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలోట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, ఈషా హాస్పిటల్ డైరెక్టర్ భరత్ రెడ్డి,డి ఎస్ పి అంజయ్య, స్పోర్ట్స్ అధికారి సత్తార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మి నారాయణ , వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు మరియు తదితరులు పాల్గొన్నారు.


# తప్పిన కొద్ది మామూళ్ల "మత్తు"!

మొదటి పేజీ తరువాయి...
తన పదవిని అడ్డంగా ఉపయోగించుకొని భారీ స్థాయిలో మామూళ్ల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్ఫోర్స్‌మెంట్ విభాగంలో సీఐగా పనిచేసిన ఆయన ఎస్‌హెచ్‌వో కుర్చీ కోసం వ్యూహాత్మకంగా పావులు కదిపి, అనంతరం ఆ పదవిని దక్కించుకున్నారని ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్, నందిపేట్, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాలు ఆయన పరిధిలో ఉండగా, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, వైన్స్ షాపుల నుంచి నెలవారీగా భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో వైన్స్ షాప్ నుంచి నెలకు రూ.30 వేల చొప్పున, కల్లు వ్యాపారుల నుంచి లక్షల్లో మామూళ్లు వసూలవుతున్నాయని, మొత్తం నెలకు రూ.20 లక్షల వరకు అక్రమ ఆదాయం చేతులు మారుతున్నట్లు శాఖలో చర్చ జరుగుతోంది.

అంతేకాకుండా, బెల్ట్ షాపుల నిర్వహణకు కూడా పరోక్షంగా ప్రోత్సాహం లభిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములు నిర్వహిస్తున్న వైన్స్ షాపులపై చర్యలు తీసుకోకుండా, మామూళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా పన్నులు చెల్లిస్తున్న బార్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని వ్యాపార వర్గాలు వాపోతున్నాయి.

ఇంకా, ఈ అవినీతి వ్యవహారాలకు సంబంధించిన లావాదేవీలను కొందరు అధికారులు డైరీల్లో నమోదు చేసుకుంటూ మరీ వసూళ్లు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. రాజకీయ



అండదండలతో కొందరు అధికారులు ఉన్నతాధికారులను సైతం లెక్కచేయడం లేదని శాఖలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సమగ్ర, లోతైన విచారణ చేపట్టాలని ప్రజలు, వ్యాపార వర్గాలు కోరుతున్నాయి. విచారణ జరిగితే మరికొందరు అవినీతి అధికారుల బాగోతాలు బయటపడే అవకాశం ఉందని చర్చ సాగుతోంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతీ పని పేద ప్రజలకు ఉపయోగపడుతుంది

**గబ్బేట గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది.**

**గబ్బేట గ్రామ అభివృద్ధికి ఏడాదిలోపు మరో కోటి రూపాయల నిధులు మంజూరు చేస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.**







**స్టేషన్ ఘనపూర్ అక్షిత న్యూస్** జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం గబ్బేట గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లను గ్రామస్తులు, లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.గబ్బేట గ్రామంలో 20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, 10లక్షల రూపాయల సిసి రోడ్లు, ఎస్సి కాలనిలో 20లక్షల సిసి రోడ్లు, ఈజీఎస్ నిధుల ద్వారా 15లక్షల సిసి రోడ్లు మంజూరు చేసి పనులు పూర్తి చేసుకొని ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం పూర్తి చేయడానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేస్తానని నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక సర్పంచ్ ను ఆదేశించారు. ఇప్పటికే గబ్బేట గ్రామంలో 18ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని అందులో ఈ రోజు 4ఇళ్లను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను చూస్తుంటే కడుపు నిండినట్లు అనిపిస్తుందని వెల్లడించారు. అలాగే కోమటిగూడెం రోడ్డును త్వరలోనే మంజూరు చేస్తానని, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ పూర్తి చేయడానికి మరో 5లక్షలు వెంటనే మంజూరు చేస్తానని, మహిళా సమాఖ్య భవనం కూడా త్వరలోనే మంజూరు చేస్తానని తెలిపారు. నెల రోజులలోపు మరో 25లక్షల సిసి రోడ్లు మంజూరు చేస్తానని అన్నారు.

నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్లలో గబ్బేట గ్రామంలో కోటి 50లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసుకున్నామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలోపు గబ్బేట గ్రామ అభివృద్ధికి మరో కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం చేశాడో ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదని, దళిత బంధు పథకాన్ని కూడా అమ్ముకున్న వ్యక్తి గత ఎమ్మెల్యే అని ఆరోపించారు. 10ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు. కడియం శ్రీహరి ఏనాడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. పని చేయని వారిని, పని చేసే వారిని ఒకే రకంగా చూడవద్దని ప్రజలను కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలనే ఏకైక సంకల్పంతో పని చేస్తున్నాన్ని పేర్కొన్నారు. పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్నాలకు బోనస్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

**యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో అవగాహన ర్యాలీ, నాటికలు, పోస్టర్ పెయింటింగ్‌లతో చైతన్యం.**

**సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.**





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో** యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతినగర్ నుండి గాంధీ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌరస్తా వద్ద విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తూ నాటికలు ప్రదర్శించారు.అలాగే పోస్టర్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొని, హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసి యాంటీ-డ్రగ్ ప్రతిజ్ఞ చేశారు.ఈసందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు.విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలపై విద్యార్థులకు , ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సంబంధించిన చట్టపరమైన శిక్షలను వివరించారు.చెడు స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిళ్లు యువతను డ్రగ్స్ వైపు మళ్లించే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మాదకద్రవ్యాల వినియోగం విద్య, భవిష్యత్ కెరీర్, కుటుంబం మరియు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి** నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ (ఈఎస్) గాయత్రికి పదో న్నతితో బదిలీ అయ్యారు. గురువారం తెలంగాణ ఎక్సైజ్ శాఖ చేపట్టిన తాజా బదిలీల్లో భాగంగా ఆమెను మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. గాయత్రి నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ శాఖ పరిపాలనలో కీలక పాత్ర పోషించారు. ఆమె పదోన్నతితో బదిలీ కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లాకు నూతన ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. వేణుగోపాల్ రెడ్డి గతంలో ఖమ్మం జిల్లాలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. తాజా బదిలీల్లో భాగంగా ఆయనకు పదోన్నతి లభించి నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే ఆయన జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి





**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలో స్టేడియం గ్రౌండ్ నందు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ముందుగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం సిగ్నేచర్ క్యాంపెయినింగ్ బోర్డుపై సంతకం చేసి కార్యక్రమానికి తమ మద్దతును తెలియజేశారు. అనంతరం జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించగా, జిల్లా ఎస్పీ అధికారులు, విద్యార్థులు, యువత, సీనియర్ సిటిజన్స్‌తో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ డి.జానకి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన వ్యక్తి మాత్రమే కాకుండా, వారి కుటుంబం మరియు సమాజం మొత్తం తీవ్ర ప్రభావానికి లోనవుతుందని అన్నారు. యువత తమ జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, సమాజాన్ని వ్యసన రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యూ.ఓ జరీనా, డి.ఎల్.ఎస్.ఎ. టీం, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి, వర్నిక ఎన్.జీ.ఓ., జిల్లా అధికారులు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్ మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# భైంసా 2బీహెచ్‌కే గృహాల పనులు

# వేగవంతం చేయాలి

**కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సమీక్ష**

**గృహాలను సందర్శించి మౌలిక వసతులపై పరిశీలన**

**నిర్మల్ అక్షిత బ్యూరో, జూన్ 25 :--** భైంసా పట్టణంలో నిర్మాణంలో ఉన్న 441 డబుల్ బెడ్‌రూమ్ (2బీహెచ్‌కే) గృహాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో 2బీహెచ్‌కే గృహాల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఇ, ఇ, సురేష్ బాబు. డిఇ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లింగయ్య, తహశీల్దార్ శశిభూషణ్, విద్యుత్ శాఖ డి ఇ,తో పాటు , మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో గృహాల నిర్మాణ పురోగతి, కేటాయింపు ప్రక్రియ, మౌలిక వసతుల కల్పన, పెండింగ్‌లో ఉన్న పనులపై సమగ్రంగా చర్చించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.





అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్, సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ భైంసా పట్టణంలోని పార్డి--బి రోడ్డులో బొర్రా గణేష్ సమీపంలో నిర్మితమవుతున్న (441) 2బీహెచ్‌కే గృహాలను ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. గృహాల నిర్మాణ నాణ్యత, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, అంతర్గత రహదారులు తదితర మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించారు.లబ్ధిదారులకు మెరుగైన వసతులు కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన వారు, గృహాల నిర్మాణం పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందజేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

## గంజాయి సరఫరా, వినియోగ నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో** యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలో ఈరోజు నార్కోటిక్ డాగ్ సహాయంతో కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లు, బస్టాండ్ , విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ....జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్‌లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయండి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు**



**వరంగల్,అక్షిత బ్యూరో:** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎస్.ఆర్.ఆర్. తోటలో సేవల పర్యవేక్షణ, నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివరావు గురువారం అక్కడ అందిస్తున్న వైద్య సేవలు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును సమీక్షించారు.ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలు, వైద్య రికార్డులు, ఔషధాల లభ్యత, మాతా-శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, యూ-విన్, ఎన్సీడీ, టీకా కార్యక్రమం తదితర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించారు. సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు వైద్య సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు అందించారు.

అనంతరం యూపీహెచ్‌సీ ఎస్.ఆర్.ఆర్. తోటకు నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాలోని అన్ని ఆరోగ్య సంస్థల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని డా. బి. సాంబశివరావు తెలిపారు.

## గాంధీ భవన్ నుంచి ఘనంగా స్వర్ణోత్సవ బస్సు యాత్ర



**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్** లంబాడ, ఎరుకల, యానాది ప్రజలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 1976 సెప్టెంబర్ 18న నాటి భారత దేశ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ ఎస్టీ రిజర్వేషన్ కల్పించిన చారిత్రక నిర్ణయానికి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, హైదరాబా ద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు యాత్రను ప్రారంభించగా, టి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి, గౌరవ ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ సమాజానికి న్యాయం చేయాలనే దృఢ సంకల్పంతో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఆ నిర్ణయం వల్ల లంబాడీ, ఎరుకల, యానాది వంటి ఆదివాసీ వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో విశేష అవకాశాలు లభించాయని అన్నారు. ఇందిరాగాంధీ గారి నిర్ణయం ఫలితంగా అనేక మంది ఆదివాసీ యువతులు, యువకులు ఉన్నత విద్యను అభ్యసించి, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబాటుకు నిదర్శనమని చెప్పారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, వారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఆదివాసీ సమాజం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ బస్సు యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ హక్కులు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపి బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, బాలు నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ శంకర్ నాయక్, ఉపాధ్యక్షులు లింగం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలి

**జూన్ 30న చలో హైదరాబాద్, ఒక్కరోజు సమ్మె**

**సీఐటీయూ హెచ్చరిక**




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో** సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజీలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం 26 వేలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కొడం రమణడిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో శానిటేషన్ కార్మికులు ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో కీలక సేవలు అందిస్తున్న శానిటేషన్ సిబ్బంది తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర కార్మిక హక్కులను వెంటనే అమలు చేయాలని కోరారు.

కాంట్రాక్టు సంస్థలు కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. శానిటేషన్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్నప్పటికీ వారికి సరైన వేతనాలు, సంక్షేమ సదుపాయాలు అందడం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కనీస వేతనాల అమలుపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 30న "చలో హైదరాబాద్" కార్యక్రమంతో పాటు ఒక్కరోజు సమ్మె చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, సీఐటీయూ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో
# ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి అవసరం**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం**

**మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత చైతన్యం అవసరం**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**






**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు ఎంత కీలకమో, యువత భవిష్యత్తు కోసం మాదకద్రవ్యాల రహిత సమాజం అంతే అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--2026)పై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు సామాజిక చైతన్యాన్ని కల్పించే ఉద్దేశంతో జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ గెస్ట్ హౌస్ వరకు గురువారం నిర్వహించిన 2కె రన్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని అన్నారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తి ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకోవడం పౌర బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, పేరు, చిరునామా, ఇతర వివరాలలో మార్పులు ఉన్నవారు వాటిని సవరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో ప్రజలు సరైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, యువత క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల వైపు మక్కువ చూపి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని అన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. యువత చెడు అలవాట్ల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్‌కు పూర్తిగా 'నో' చెప్పి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ 2కె రన్‌లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, సాంస్కృతిక సారథి కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, ఓటరు చైతన్యం, మాదకద్రవ్యాల నిర్మూలనపై బలమైన సందేశాన్ని ప్రజలకు చేరవేసింది.

# ప్రక్క జిల్లాలకు ఎల్.ఎం.డి.నీరు నగర ప్రజలకు కన్నీళ్లా

**విలీన గ్రామాల కుంటలకు, చెరువులకు రక్షణ ఎక్కడ**

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో** కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ లో ఉన్న నీటిని ప్రక్క జిల్లాలకు తరలించడం వల్ల కరీంనగర్ ప్రజలు త్రాగునీటికి కష్టాల కన్నీళ్లను చవిచూడాల్సి వస్తుందని,కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లోని చెరువులు,కుంటలు కబ్జాలకు గురవుతున్నా అధికారులు పాటించుకోవడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. నగరంలో త్రాగునీటి ఎద్దడిని నివారించాలని,విలీన గ్రామాల కుంటలు,చెరువులను కాపాడాలని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. త్రాగునీటి కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఖాళీ బిందెలతో విన్నూతనంగా నిరసన తెలపడానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు నగర పాలక సంస్థ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు.నాయకులకు పోలీసులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. అనంతరం సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తలాపున నీళ్ళున్నా చాప దూపకు ఏడ్చినట్టు కరీంనగర్ లో మానేరు డ్యామ్ ఉన్నప్పటికీ ప్రజలు త్రాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఎండా కాలంలో ప్రజలకు నీరందక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్ల లల్లో నీరు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని,నగర వ్యాపితంగా ఎటు చూసినా,ఏ డివిజన్ కు వెళ్లినా ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీరు కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రధాన కారణం అధికారులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వక పోవడమేనని, స్థానిక ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్. పార్టీ, స్థానిక ఎంపీ బిజెపి పార్టీ, అటు కాంగ్రెస్ పార్టీకి ప్రజాప్రతినిధి లేకపోవడం ఇలా నాయకుల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడం అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయక పోవడం, వారికి సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడమేనన్నారు.కరీంనగర్ ప్రజల దాహార్తి తీర్చే నాథుడే కరువయ్యాడని ఆయన ఆరోపించారు. ఇటీవలి కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ లో విలీన మైన గ్రామాల్లోని చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని, రియల్ ఎస్టేట్ వారు వాటిని కబ్జాలు చేస్తున్నారని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారని,ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని కొరవ డిందని, ఇప్పటికైనా అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు నగర ప్రజల త్రాగునీటి కష్టాలను, భూముల కబ్జాలను నిలువరించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరిన్ని పోరాటాలు నిర్వహించకతప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, మచ్చ రమేష్, శాఖ కార్యదర్శులు బాకం ఆంజనేయులు, గామినేని సత్యం, చెంచల మురళి, నగునూరి రమేష్, కాల్వ శ్రీనివాస్, ఈ.భారతి, కేం సారం శ్రీనివాస్, అల్లేపు రాజు, నునావత్ శ్రీనివాస్, మామిడిపల్లి హేమంత్ కుమార్, మమత, స్రవంతి, దానవేణి రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ పోచమ్మ దేవి, బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవం



**మహబూబ్ నగర్ ,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీ మరియు ధనలక్ష్మి కాలనీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ పోచమ్మ దేవి, నాగులు, మరియు బొడ్రాయి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల జయజయధ్వనాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ పరమ పవిత్రమైన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ గారులి , మరియు డిప్యూటీ మేయర్ శ్రీ ఎం. సురేందర్ రెడ్డి విచ్చేశారు. వారితో పాటు పలు డివిజన్ల కార్పొరేటర్లు, వార్డు సభ్యులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..

# ఎస్,ఐ,ఆర్ సర్వే క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, అక్షిత బ్యూరో:** బుధవారం ప్రారంభమైన ఇంటింటి ఎస్ఐఆర్ సర్వేను కొత్తవాడ,దేశాయిపేట లో జరుగుతున్న ఇంటింటి సర్వే ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న ఒక ఇంటిని సందర్శించి బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో)ను అడిగి సర్వే విధానం, వివరాలను తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించాలని సూచించారు.ఎస్ఐఆర్ సర్వే విజయవంతం కావడానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశాయిపేటలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభం



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ నగరంలోని కొత్తవాడ, దేశాయిపేట లో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ను వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వంశీ, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో జూన్ 25 నుంచి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కేటీఆర్ కు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు



**సత్తుపల్లి,అక్షిత న్యూస్:** బుధవారం నాడు సత్తుపల్లి లోని స్థానిక ఎంఆర్ గార్డెన్ లో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు సత్తుపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులు తమ సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఎన్నడూ లేని విధంగా ప్రింట్ మీడియాలో నియోజకవర్గ స్థాయిలో ఇన్చార్జులుగాపనిచేస్తున్న జర్నలిస్టులకు స్థాయి తగ్గించి మండల స్థాయి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయుట గురించి వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పౌర సంబంధాల శాఖ నియోజకవర్గ ఇన్చార్జి లకు మండల అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా నియోజకవర్గస్థాయి జర్నలిస్టులను హోదా తగ్గించి కార్డులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు ఏళ్ల తర్వాత మొదటిసారిగా మంజూరు చేసిన అక్రెడిటేషన్ కార్డుల పంపిణీలో నియోజకవర్గ కేంద్రంలో పనిచేస్తున్న ఆర్సి ఇన్చార్జిల హోదాను తగ్గించి మండల అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేస్తూ రాష్ట్ర బస్సు పాసులు అర్హత కలిగిన వారందరికీ హోదాను తగ్గించి మండల అక్రెడిటేషన్ కార్డులను జారీ చేస్తూ రాష్ట్ర బస్సు పాసులు అర్హత కలిగిన వారందరికీ జిల్లా బస్ పాసులకు కుదిస్తూ హోదాను తగ్గించింది. ఈ ప్రభుత్వ తీరును ఎండగడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ గతంలో మాదిరిగానే అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేయాలనే విధంగా బిఆర్ఎస్ పార్టీ తరపున సహకరిస్తారని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలోని జర్నలిస్టులందరూ పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రోగ్రాంపై బి.ఎల్.ఓ లకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా

**డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ హాజరు**

**కార్యక్రమంలో ఓటరు అవగాహనపై బిఎల్ ఓ లకు దిశానిర్దేశం**



**సత్తుపల్లి , అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణ మరియు మండల స్థాయిలో నిర్వహిస్తున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం పై బిఎల్ ఓ లకు అవగాహన కార్యక్రమం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటరు నమోదు మరియు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మ్యాపింగ్ ఫార్మ్ విషయంలో బిఎల్ ఓ లు అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే, ఈ నెల 30న జరగనున్న ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమం సందర్భంగా డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తరఫున బిఎల్ ఓ లు పాటించాల్సిన విధానాలు, బాధ్యతలపై వివరంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపాలిటీ చైర్మన్ యండి రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, మండల మరియు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంచి కోసం, జనం కోసం పనిచేసే వారే సమాజానికి ఆదర్శం

**కాకతీయ కమ్మ సేవా సమితి కళ్యాణ మండపం ప్రారంభంలో మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు.....**







**కోదాడ అక్షిత ప్రతినిధి** కోదాడ పట్టణంలోని దుర్గాపురం వై జంక్షన్ వద్ద కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గురువారం ఘనంగా ప్రారంభించారు. కోదాడకు చేరుకున్న ఆయనకు సమితి నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, తాను పదవి విరమణ చేశానే గానీ పెదవి విరమణ చేయలేదని వ్యాఖ్యానించి సభికులను ఆకట్టుకున్నారు. తాను సంపాదించిన జ్ఞానాన్ని యువతరానికి అందించేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని తెలిపారు. మంచి పనులు చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇష్టపడి, కష్టపడి పని చేస్తే ఎవరూ నష్టపోరని యతి ప్రాసలతో ప్రసంగాన్ని రంజింపజేశారు. ఆవు, చెట్టు పరులకు ఉపకారం కోసం జీవిస్తాయని, మనుషులు కూడా సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించి కాపాడాలని, ప్రస్తుతం ప్రకృతి పరితపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కులం ఉండవచ్చని, కానీ కులపిచ్చి ఉండకూడదని స్పష్టం చేశారు. సేవా భావంతో అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను న్యాయవాదిగా మారాలనుకున్నప్పటికీ, అత్యవసర పరిస్థితుల ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన బాల్య జీవితంలోని పలు సంఘటనలను సభికులతో పంచుకున్నారు. రాజకీయాల్లో ఉన్నవారు తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయాలని వెంకయ్య నాయుడు చేసిన సూచనలను ప్రస్తావిస్తూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ కోవకు చెందిన నాయకుడని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. కళ్యాణ మండప నిర్మాణానికి భారీ విరాళాలు అందించిన దాతలను అభినందించిన ఆయన, సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాకతీయ కమ్మ సేవా సమితి బాధ్యులు, దాతలు, ప్రముఖులు, సభ్యులు, వివిధ రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.అనంతరం సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిభ కలిగి న విద్యార్థులకు మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ళ సీతారామయ్య, సంఘం కోదాడ అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వేమూరి సురేష్, కోశాధికారి పోటు రంగారావు, ఉపాధ్యక్షులు మార్తి మాధవరావు, సంయుక్త కార్యదర్శి కనగాల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండాపూ దశరథ జనార్దన్ రావు, మాజీ ఎమ్మెల్యే కోటేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కమ్మ సేవా సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు రవిశంకర్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ లంబాడీలకు 26 ఏళ్ల ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి

**కడ్తాల్ మాజీ జడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్రఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ దశరథ్ నాయక్**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి** కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై యాత్రలు చేస్తూ వస్తున్న కాంగ్రెస్ నాయకులకు సూటిగా ప్రశ్నిస్తూతెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శ్రీమతి ఇందిరా గాంధీ లంబాడీలకు రిజర్వేషన్లను కల్పించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా గిరిజనతరుణోత్సవాల బస్సు యాత్ర నిర్వహించడం స్వాగతిస్తామని కానీ ఇందిరమ్మ పేరు చెప్పి లంబాడి బిడ్డల ఓట్లతో అధికారంలోకివచ్చి మూడు సంవత్సరాలుగాల ఒబాడీలకు జరిగిన అన్యాయంపైసమాధానం చెప్పకుండా సర్వోత్సవాలు జరపడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని.కాంగ్రెస్ యాత్రల నాయకులారాలంబాడి తండాల్లో అడుగు పెట్టే ముందు,మా 54 ఏళ్ల అన్యాయానికి బంజారా సమాజానికి క్షమాపణ చెప్పండి. అంబేద్కర్ ఆశయాలను, ఎస్సీ, ఎస్ టి ల హక్కులను కాలరాసిన చరిత్ర మీది.ఇకపై మోసపోవడానికి వీల్లేదు! మన హక్కుల రక్షణ కోసం మరో నంగారా భేరి మ్రోగిద్దాం!లంబాడీలకు సమాధానం చెప్పాల్సిన సమాధానాలు

చేవెళ్లే డిక్లరేషన్ ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు ఇచ్చిన హామీ అమలు చేశారా?పోడు భూములకు పట్టాలిచ్చారా? గిరిజన విద్యార్థులకు అందాల్సిన స్కాలర్షిప్లు ఇచ్చారా?గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ఎందుకు రిలీజ చేయలేదు.గిరిజన తండాలాభివృద్ధికి ఇప్పటి వరకు ఎన్ని నిధులు కేటాయించారు శ్వేత పత్రం విడుదల చేయాలని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ కు ఎన్ని నిధులు కేటాయించారో శ్వేత పత్రం విడుదల చేయాలని.తండాల గ్రామపంచాయతీలకు 25 లక్షల రూపాయలు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ వెంటనే విడుదల చేయాలి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను వెంటనే అమలుచేసిచూపాలనితాండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలి సేవాలాల్ స్ఫూర్తితో ఐక్యంగా లంబాడీ బిడ్డలారా! మేధావులారా! యువతీ యువకులారా! ముందుకు సాగాలని తమ ఉనికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్ శ్రీను నాయక్ మాజీ సర్పంచ్ శ్వేతా భూనాద్ మాజీ ఉపసర్పంచ్ రమణ వార్డ్ సభ్యులు దేవా నాయక్ మాజీ వార్డు సభ్యులు భీమన్ నాయక్ నాయకులు కోట్యా నాయక్ శీను నాయక్ భిక్య నాయక్ సక్రు నాయక్ చందర్ నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కానాయపల్లి నిర్వాసితుల సమస్యలు

# పరిష్కరిస్తా

**ముఖ్యమంత్రి, మంత్రి దృష్టిలో ఆర్ అండ్ ఆర్ సమస్య ఉంది**

**నిర్వాసితులు అందరు కలిసికట్టుగా ఉండండి**

**మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాది**

**పార్టీలకతీతంగా కలిసి కట్టుగా రండి మీ సమస్యను పరిష్కరిస్తా**

**నిర్వాసితులతో కలిసి ఎమ్మెల్యే సమీక్షా**






**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కానాయపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాని మీ సమస్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టిలో ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్నగర్ జిల్లా దమగ్నాపురం గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నివాసంలో కానాయపల్లి గ్రామ నిర్వాసితులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నిర్వాసితులు ఆర్ అండ్ ఆర్ సమస్యలను ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే కు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఆర్ అండ్ ఆర్ బెనిఫిట్స్, ప్లాట్స్ ఇవ్వాలి, సోసియో ఎకనామికల్ సర్వే తప్పిపోయిన 30 మందిని రీ సర్వే చేసి ప్లాట్స్, ఆర్ అండ్ ఆర్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. నిర్వాసితులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి, 95 మందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 5 వేలు వచ్చాయి వాళ్లకు సమానంగా డబ్బులు ప్లాట్లు ఇవ్వాలి, ప్రస్తుతం కేటాయించిన ప్లాట్లల్లో మట్టితో లెవలింగ్ చేసి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామంలో దేవాలయాలకు, చర్చిలకు, మసీద్ లకు స్థలాలు కేటాయించి వాటి నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ సమస్య గత 20 ఏండ్ల నుండి నడుస్తుంది గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించింది ఇప్పుడు కూడా పనులు అయిపోగొట్టే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. తప్పనిసరిగా ప్రాజెక్టుల రివ్యూ సమావేశంలో నేను ప్రత్యేకంగా ముఖ్యమంత్రికి శంకర సముద్రం గురించి చెప్పున్నానని గుర్తు చేశారు. మీ సమస్యలను పరిష్కారం చూపే దిశలో అండ్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు కూడా నివేదికలు సిద్ధం చేశారని తెలిపారు. మీ సమస్యలు పరిష్కరించుందుకే మంత్రులను మీ గ్రామానికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇటీవల సోమశిలలో జరిగిన రివ్యూ సమావేశంలో మళ్ళీ మీ శంకర సముద్రం గురించి లేవనేత్తడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా ఉన్నారు తప్పకుండ మీ పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులంతా ఒక తాటిపై ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని ఒకరు వెనక్కి లాగడం మిగత వాళ్ళు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. నష్టపోయింది మీరు మీకు న్యాయం చేయడానికి నేను ఉన్న కానీ మీలో ఐక్యత లేదు అందుకే మీ సమస్య సమస్యగానే మిగిలిందని చెప్పారు. ఇప్పటికైనా మీరు పార్టీలను పక్కకు పెట్టి ఊరు సమస్య కొరకు ఏకం కండి మీకు నేను అండగా ఉండి మీకు న్యాయం చేస్తానని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసే దిశలో మీ సమస్య కూడా పూర్తి అయితది వీటితో పాటు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కూడా త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ రావుల జితేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ భర్త సాయిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల కరుణాకర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లు గోకరయ్య, వడ్డే రాములు, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు శివ యాదవ్, నాయకులు రవీందర్ గౌడ్, రావుల మురళీధర్ రెడ్డి, హోటల్ రాజు, ధనుష్, కుర్మయ్య, చిన్న నర్సింహా, చిన్న వెంకటయ్య, కొత్త వెంకటయ్య, రాములు యాదవ్, నాగరాజు, బొజ్జన్న, బాబు, కొత్త రాములు, బాజ బందెన్న, డీలర్ శ్రీను, సాయిరాం, కొత్త శ్రీను, రఘు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి

**అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.**



**కరీంనగర్ అక్షిత బ్యూరో** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాలు, ప్రహరీ, కిచెన్ షెడ్లు వేగవంతం చేసి వెంటనే ఈనెల 30 లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈజీఎస్ పెండింగ్ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈజీఎస్ కింద మంజూరైన పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవా లన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గడువు తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. మంజూరైన పనులు ఆపకుండా తక్షణం గ్రౌండింగ్ చేసి ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు ఏపీఓలని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో మస్టర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ గీత, పంచాయతీరాజ్ ఈఈ జనార్దన్, అదనపు డీఆర్డీఓలు, జిల్లాలోని ఆరు సబ్ డివిజన్ల పంచాయతీరాజ్ డీఈలు, 15 మండలాల ఏఈలు పాల్గొన్నారు

# ప్రజలందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పక పాల్గొనాలి

**టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, దానిని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కంది మండలంలోని ఏద్దుమైలారం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, తమ ఓటును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ దేశంలో ఇదే తొలిసారి కాదని, స్వాతంత్ర్యం అనంతరం ఇది ఎనిమిదోసారి నిర్వహిస్తున్న సమగ్ర సవరణ కార్యక్రమమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు, మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, కంది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగులయ్య, ఏద్దుమైలారం సర్పంచ్ చంద్రయ్య, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ పచ్చడి తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ దాడి

**ఒకరి అరెస్ట్ -- రూ.2.25 లక్షల విలువైన కల్తీ నిల్వలు స్వాధీనం**



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో అత్యంత అపరిశుభ్ర వాతావ రణంలో అక్రమంగా పచ్చడి తయారీ, నిల్వలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున కుళ్లిపోయిన పచ్చడి ముడిసరుకులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వాటిని చిన్న ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి స్థానిక కిరాణా దుకాణాలు, ఇతర చిన్న వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో అరికెల శ్రీనివాస్ (51), కాశీబుగ్గ నివాసినిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 750 కిలోల టమోటా, 900 కిలోల మామిడి, 200 కిలోల నిమ్మకాయలు, 100 కిలోల ఉసిరికాయలు, 150 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్‌తో కూడిన మొత్తం రూ. 2,25,000 విలువైన కుళ్లిపోయిన, కల్తీ ఆహార నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు బ్రాండ్ లేని లేదా అనుమానాస్పద ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. ఇలాంటి అక్రమ నిల్వ కేంద్రాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ దాడిని ఏసీపీ టాస్క్ ఫోర్స్ ఎ. మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బందారి రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్ మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు.

# మానాజీపేట గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశం

**గ్రామ సర్పంచ్ సుమతమ్మ మైపాల్ రెడ్డి**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ గౌడ్**



**నాగర్ కర్నూలు అక్షిత ప్రతినిధి** లింగాల మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మానా జీపేట గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశం చేశారు ఇట్టి కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సుమతమ్మ మైపాల్ రెడ్డి . మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారాయణ గౌడ్. పాల్గొని ఇందిరమ్మ గృహప్రవేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రతి పల్లెలో ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు , మంజూరు చేయడం జరుగుతుంది. అధ్యక్షతన సుమతమ్మ మైపాల్ రెడ్డి సర్పంచ్ నారాయణ గౌడ్ మాజీ సర్పంచ్ స్వామి భగవంతు లింగస్వామి వార్డు మెంబర్స్ సుధాకర్ గౌడ్ మానాజీపేట గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వసతుల్లేని ప్రభుత్వ బడులు

**అదనపు మురుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి** రామన్నపేట మండలం నీర్నేముల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించరు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి సిపిఎం మండల కమిటి సభ్యులు నాగటి ఉపేందర్ మాట్లాడుతూ పాఠశాలలో 7 తరగతులు, 60 మంది విద్యార్థులు ఉండగా కేవలం 6గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని ఆగస్టు నెలలో మరో ఉపాధ్యాయురాలు పదవీ విరమణ (రిటైర్మెంట్) చేయనున్నారని దాంతో ఉపాధ్యాయుల సంఖ్య 5కి తగ్గుతుందని ఏడు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉంటే బోధన కుంటుపడుతుంది కాబట్టి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తక్షణమే అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి విద్యార్థి ఒక్కంటికి కేవలం ₹6.18 పైసలు మాత్రమే ఇస్తోందని ఇంత తక్కువ ధరతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడం సాధ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్లోని 6 గదుల్లో మొత్తం 12 ఫ్యాన్లు ఉండగా, వాటిలో 8 మాత్రమే పని చేస్తున్నాయి, 4 ఫ్యాన్లు పాడైపోయాయి. వాటి స్థానంలో కొత్త ఫ్యాన్లు అమర్చాలని కోరారు. పాఠశాలలోని మంచినీటి ట్యాంకును శు భ్రం చేయడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని 31 మంది విద్యార్థినులు ఉండగా కేవలం ఒకే ఒక్క బాత్రూమ్ ఉండటం, ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు కూడా శిథిలావస్థకు చేరాయి. కాబట్టి బాలికల కోసం అదనంగా నూతన మరుగుదొడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ఏశబోయిన రామచంద్రం, మాజీ వార్డు సభ్యులు నేమనంది లింగయ్య, బోయిని వేణు, నాగటి నరేష్, ఆవుల మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** జిల్లాలో జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో జాతీయ టీకా కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. జిల్లాలో మొత్తం 1,80,405 మంది ఐదేళ్లలోపు చిన్నారులను పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా కవర్ చేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జూన్ 28న 1137 పోలియో బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని , 28న పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని వెల్లడించారు. దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో బూత్‌కు తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతి నిధులు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జూన్ 28న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే పల్స్ పోలియో బూత్‌లకు తమ ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# సర్ పేరుతో ఓటు హక్కును హరించే చర్యలను విరమించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**




**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :**కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమం పేరుతో కోట్లాది మంది పేదలు,వలస కార్మికులు, గిరిజనులు,దళితులు, మైనారిటీలు,అట్టడుగు వర్గాల ఓటు హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల జాబితాల్లో పేర్ల సవరణ,కొత్త ఓటర్ల నమోదు,మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం అమలు చేస్తున్న సర్ విధానం అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు.ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలనిసూచించారు.

ప్రతి ఓటరికి తగిన సమాచారం అందించి,అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వాలన్నారు.ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్ట రాదన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు.అందువల్ల ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని,ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా సర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు.ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగితే సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ రామ్మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలు

**ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ**

**అపూర్వ బధిరుల పాఠశాలలో అన్నదానం**



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,శ్రీ కృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్,18వ వార్డు కౌన్సిలర్,ప్రముఖ వైద్యులు వూర రామ్మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు,అభిమానులు కేక్ కట్ చేసి బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీతో పాటు,కాసరబాద రోడ్ లోని అపూర్వ బధిరుల పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సేవా దృక్పథంతో సుదీర్ఘకాలం పాటు పేదలకు వైద్య సేవలు అందిస్తూ నిరంతరం పని చేస్తున్నారని అభిప్రాయ పడ్డారు.వైద్య వృత్తిలో పేదల పెన్నిధిగా ఎంత ఎదిగినా ఒదిగే ఉండటం ఆయన నైజం అని అన్నారు. వైద్య రంగంతో పాటు రాజకీయ రంగంలో కూడా రాణిస్తూ భవిష్యత్తులో అన్ని వర్గాల గొంతుకై ఉన్నత పదవులు పొందాలని, ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకొని ప్రజలకు నిరంతరం సేవలు అందించాలని ఆకాంక్షించారు. వైద్య వృత్తిలో ప్రముఖ వైద్యులుగా రాణిస్తూ శ్రీకృష్ణ ట్రస్ట్ ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు,పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మర్యాద సైదులు యాదవ్,లింగమంతుల దేవస్థానం చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్,కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య కరుణాకర్,జిల్లా కాంగ్రెస్ నాయకులు యలగబోయిన మధు యాదవ్,మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న,మాలోతు కమల్ చంద్రు నాయక్,నాయకులు బోల్క వెంకట్,వీరబోయిన లింగయ్య, తూము వెంకన్న,కోడి లింగయ్య, బడుగుల సైదులు,కంచుగట్ల